E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 23-07-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



వినియోగదారుడే రారాజు » 3లో

మీ పాన్ కార్డుపై మరెవరైనా లోన్ తీసుకున్నారా? చెక్ చేసుకోండిలా! » 4లో




విధ్వంసం సృష్టించిన టీమిండియా కెప్టెన్.. వన్డేల్లో రెండో » 6లో



వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఒడుదొడుకులు.. రష్మి కీలక నిర్ణయం » 5లో



ప్రభుత్వ సర్వీసులకు ఓపెన్ఏఐతో భాగస్వామ్యం » 4లో



## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల



ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)2025 జూన్ ఫలితాలు విడుదలయ్యాయి. సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. టెట్ పరీక్షలకు మొత్తం 90,205 మంది హాజరుకాగా..30,649 మంది అర్హత సాధించినట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 18 నుంచి 30 వరకు మొత్తం 16 సెషన్లలో 7 భాషల్లో టెట్ పరీక్షలు నిర్వహించారు.

తరువాయి 2 లో

# అసెంబ్లీలో ఇచ్చిన మద్దతు పార్లమెంట్‌లో కూడా ఇస్తారన్న నమ్మకం ఉంది

- బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా పార్టీలను కోరతాం: డిప్యూటీ సీఎం భట్టి
- బీసీ రిజర్వేషన్లు సహేతుకమని భావించే అన్ని పార్టీలనూ కలుస్తాం
- రాహుల్ ఆలోచనను కేంద్రం ఆమోదించాల్సిన పరిస్థితి వచ్చింది
- దేశంలో ఎక్కడ, ఎప్పుడు కులగణన జరిగినా తెలంగాణనే మోడల్‌గా ఉండబోతోంది.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి
- దళితులన్నా... బీసీలన్నా చులకన భావం ఉన్నట్టుంది
- లీగల్ నోటీసులకు భట్టి భయపడడు...నేను మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నా..



తరువాయి 2లో

## ఉచిత ప్రయాణాలు... 200 కోట్లు

'మహాలక్ష్మి' పథకం సరికొత్త రికార్డు
ఆర్టీసీ జీరో టికెట్ల జారీలో కీలక మైలురాయి
ఆడబిడ్డలకు అభినందనలు.. సీఎం రేవంత్‌రెడ్డి
మహిళలకు రూ.6,671 కోట్ల ఆదా: మంత్రి పొన్నం



ఈ కబురు, హైదరాబాద్: మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకానికి భారీ ఆదరణ లభిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళలకు భద్రతను, ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తోంది. జులై 22 (మంగళవారం) నాటికి రాష్ట్రవ్యాప్తంగా 199.71 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసింది. బుధవారం ఈ సంఖ్య 200 కోట్లకు చేరుకుంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ పథకంతో ఆర్టీసీ తీరు మారింది. గతంలో బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి (ఓఆర్) 67 శాతం ఉండేది. ఆర్టీసీకి ప్రతినెలా భారీ నష్టాలు వచ్చేవి. ప్రయాణికుల కోసం డ్రైవర్, కండక్టర్లు ఎదురుచూసేవారు. మహాలక్ష్మి పథకం అమలుతో సగటు ఓఆర్ 95 శాతానికి పెరిగింది.జీరో టికెట్లు.. రీయింబర్స్‌మెంట్: మహిళలకు ఆర్టీసీ 'జీరో' టికెట్లను జారీ చేస్తోంది. టికెట్ల ఛార్జీల్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. నెలకు రూ.358.79 కోట్ల చొప్పున 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.4,305.49 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది.

తరువాయి 2 లో

## రేపటి నుంచి ప్రధాని మోడీ విదేశీ పర్యటన

» 2లో





## సన్న బియ్యంలో 50%నూకలే.. మాజీ మంత్రి హరీశ్‌రావు

» 2లో

## ధన్‌ఖడ్ రాజీనామా.. కారణాలు అవేనా..?



ఈ కబురు: ఉపరాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ విపక్షాలు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికార కూటమి నేతలు మౌనం వహించగా.. ప్రధాని సహా పలువురు ఇప్పుడిప్పుడే స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉపరాష్ట్రపతి పదవి నుంచి వైదొలగడంపై పలు విశ్లేషణలు తెరమీదకు వచ్చాయి.

తరువాయి 2 లో

» 3లో



## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లదే క్రియాశీల

## 5 వేల మంది తల్లులకు కేసీఆర్ కిట్ల పంపిణీ



» భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈ కబురు, హైదరాబాద్: కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని.. రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశుమరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్.. 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో మంగళవారం కేసీఆర్ కిట్లను అందించారు. గత 20 నెలల నుంచి ఈ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే ఈనెల 24న తన జన్మదినం సందర్భంగా సిరిసిల్లలో సుమారు 5 వేల మంది తల్లులకు కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నేతలు సబిత, మధుసూదనాచారి, ముఠా గోపాల్ పాల్గొన్నారు.

తరువాయి 2లో



## భారత సైన్యంలోకి మోస్ట్ అడ్వాన్స్‌డ్ చాపర్లు

» హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న మూడు ఏహెచ్–64ఈ అటాక్ హెలికాప్టర్లు
» ఈ ఏడాది ఆఖరు నాటికి మరో మూడు హెలికాప్టర్ల రాక

ఈ కబురు,న్యూఢిల్లీ: భారత సైన్యంలో మైలురాయి లాంటి ఘట్టం చోటుచేసుకుంది. 15 నెలల నిరీక్షణకు తెరపడింది. అత్యాధునిక ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లు అమెరికా నుంచి భారత్‌కు చేరుకున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో అడుగుపెట్టాయి. మొదటి బ్యాచ్‌లో భాగంగా మూడు హెలికాప్టర్లను అమెరికా మిలటరీ సరుకు రవాణా విమానంలో మంగళవారం ఇండియాకు చేర్చారు. ఒప్పందం ప్రకారం 2024 మార్చి నెలలోనే రావాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో పలుమార్లు జాప్యం చోటుచేసుకుంది. ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ రూపొందించింది.

తరువాయి2లో

## రెండో రోజూ అదే రగడ

» 3లో



ఈ-కబురు

23-07-2025
బుధవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

## అసెంబ్లీలో ఇచ్చిన మద్దతు పార్లమెంట్‌లో కూడా ఇస్తారన్న నమ్మకం ఉంది : డిప్యూటీ సీఎం



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలోని వెనుక బడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు పార్ల మెంట్ ఆమోదం కోసం ప్రయత్నిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సహేతుకమని భావించే ప్రతీ రాజకీయ పార్టీని కలుస్తామన్నారు. ఈ బిల్లును పార్లమెం ట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా సహకరించాలని అన్ని పార్టీలను కోరతామని, అందరి మద్దతూ కూడగడతామని చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్ల మెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఢిల్లీ వెళ్లి జాతీయ స్థాయి పార్టీలను కలిసి మద్దతు కోర తామని చెప్పారు. శతాబ్దాల నుంచి అన్యాయం జరుగుతున్న వర్గాలకు న్యాయం చేసే దిశలో తాము మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరిస్తారనే ప్రగాఢ నమ్మకం ఉందని చెప్పారు. ఈ బిల్లును అసెంబ్లీలో పెట్టి చర్చించినప్పుడు బీజేపీ, బీఆర్‌ఎస్ కూడా మద్దతిచ్చాయని, ఇప్పుడు పార్లమెంట్‌లో కూడా ఆ పార్టీలు మద్దతివ్వాలని కోరారు. ఈ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏ సమాచారం కోరినా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయంలో అనుసరించిన శాస్త్రీయ పద్ధతులను దేశంలోని పార్లమెంట్ సభ్యులకు వివరిస్తామని భట్టి చెప్పారు. కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇతర పార్టీల ఎంపీలకు కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అన్ని విషయాలను తెలియజేస్తామన్నారు. గతంలో జరిగిన సర్వేల అనుభవాలు, తాము నిర్వహించిన పైలట్ సర్వే, సర్వే ప్రశ్నావళి రూపకల్పన, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన సమావేశాలు, ఎన్యూమరేషన్ ప్రక్రియ, డేటా ఎంట్రీతోపాటు ఈ సర్వేను స్వతంత్ర నిపుణల కమిటీతో అధ్యయనం చేయించిన తీరును అందరికీ అర్థమయ్యేలా వివరిస్తామన్నారు. మొత్తం 88 కోట్ల పేపర్లలో నిక్షిప్తమైన కులగణన సమాచారాన్ని సరళీకృతం చేసిన అనంతరం అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందించామని చెప్పారు. నిపుణల కమిటీ ఇచ్చిన నివేదికను కూడా అసెంబ్లీలో, కేబినెట్‌లో పెట్టి ఆమోదించిన తర్వాత ప్రజల ముందుకు తెస్తామని వెల్లడించారు.

ఆయన అడ్డుకునేలా మాట్లాడతారు..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు దళితులన్నా, బీసీలన్నా చిన్నచూపు ఉన్నట్టుందని భట్టి వ్యాఖ్యానించారు. అందుకే ఆయా వర్గాలకు మేలు చేసే ప్రయత్నాలు ఎప్పుడు జరిగినా ఆయన అడ్డుకునే విధంగా మాట్లాడతారన్నారు. గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన వ్యవహారంలో ఆయన పాత్ర ఏంటో అందరికీ తెలుసన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని తాము చెప్పామని, చేశామని అన్న భట్టి.. తామే చెప్పాం కాబట్టి తామే చేసుకోవాలని రాంచందర్‌రావు వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. తామేమీ బీజేపీ అంతర్గత వ్యవహారాల గురించి అడగడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగే ప్రక్రియ గురించి అడుగుతున్నామని చెప్పారు. రాంచందర్‌రావు పంపిన లీగల్ నోటీసులు అందాయా అన్న ప్రశ్నకు భట్టి సీరియస్‌గా స్పందించారు. 'లీగల్ నోటీసులకు భట్టి భయపడడు. నేను ఏం మాట్లాడానో దానికి కట్టుబడి ఉన్నా. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీగా, వ్యక్తిగా ఏం చెప్పాలో తెలుసు' అని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీకి చిత్తశుద్ధి లేకపోతే ఇంత ప్రక్రియ ఎందుకు చేస్తామని, ఈ అంశాన్ని ఇంత దూరం తీసుకొచ్చామంటేనే తమ చిత్తశుద్ధి ఏంటో ప్రజలు అర్థం చేసుకోవాలని భట్టి చెప్పారు.

నాడు అవసరం లేదన్న వారే..

అసలు కులగణన అవసరమే లేదని పార్లమెంటులో చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ.. తెలంగాణలో జరిగిన సర్వే అనంతరం దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో కులగణన చేయాలనే నిర్ణయానికి వచ్చారని భట్టి చెప్పారు. 'తెలంగాణలో జరిగిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన (సీప్యాక్స్) దేశంలోనే ఒక చారిత్రక సర్వేగా నిలిచిపోనుంది. సర్వే వద్దన్న మోదీ తెలంగాణ సర్వేతోనే ఒప్పుకునే స్థితికి తీసుకొచ్చాం. ఈ ప్రక్రియకు ఆద్యుడైన రాహుల్‌గాంధీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం అనుసరించేలా చేశాం. ఇక దేశంలో ఎప్పుడు, ఎక్కడ, ఏ రాష్ట్రంలో సర్వే జరిగినా తెలంగాణను మోడల్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా శాస్త్రీయంగా ఈ సర్వే చేశాం' అని భట్టి చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

## సన్న బియ్యంలో 50%నూకలే..
## మాజీ మంత్రి హరీశ్‌రావు

ఈ కబురు: రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంలో 40 నుంచి 50 శాతం నూకలు ఉంటున్నాయని, దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా పంపిణీ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వస్తున్నాయని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు సత్వర పరిష్కారం చూపించాలని, ఇచ్చిన మాట ప్రకారం, మంచి మంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకేసారి పంపిణీ చేసిన 3 నెలల కోటా సన్న బియ్యంలో నాణ్యత లోపించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ ప్రభుత్వం ఉన్నా కొత్త కార్డులు ఇస్తూ ఉంటారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం ఇస్తే, బీఆర్‌ఎస్ ఆరు కేజీల బియ్యం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో సన్న బియ్యం అందించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ అన్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి కూడా ఈ నెల నుంచే సన్న బియ్యం కోటా అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో నాణ్యమైన



బియ్యాన్ని ప్రజలకు అందించాలన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసి కృషి చేద్దామని చెప్పారు.

## భారత సైన్యంలోకి మోస్ట్ అడ్వాన్స్‌డ్ చాపర్లు




ఎడారిని భ్రమింపజేసే రంగులో ఉన్న ఈ చాపర్లను రాజస్తాన్‌లోని జైపూర్‌లో మోహరించబోతున్నారు. ఇవి ప్రపంచంలోనే మోస్ట్ అడ్వాన్స్‌డ్ మల్టీరోల్ కాంబాట్ హెలికాప్టర్లు. ఎన్నెన్నో ప్రత్యేకతలున్నాయి. ఒప్పందం ప్రకారం బోయింగ్ సంస్థ మొత్తం ఆరింటిని సరఫరా చేయాల్సి ఉండగా, మిగతా మూడు హెలికాప్టర్లను ఈ ఏడాది ఆఖరు కల్లా అందించనుంది. ఇప్పటికే 22 ఈ-మోడల్ అపాచీలను బోయింగ్ కంపెనీ భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) అందజేసింది. ఏహెచ్-64ఈ అపాచీలను సరఫరా చేయడం ఇదే మొదటిసారి. మొత్తం ఆరు హెలికాప్టర్ల కోసం భారత ప్రభుత్వం అమెరికా సర్కార్‌తోపాటు బోయింగ్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ.4,168 కోట్లు.

**శత్రువులపై నిప్పుల వాన**

**అపాచీ హెలికాప్టర్ల రాక పట్ల భారత సైన్యం హర్షం వ్యక్తంచేసింది. వీటితో సైనిక దళాల పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుందని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ప్రధానంగా భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో కీలక సైనిక ఆపరేషన్ల కోసం ఏహెచ్–64ఈ అపాచీలను ఉపయోగించబోతున్నారు. ఉగ్రవాదుల కార్యకాలపాలను కట్టడి చేయడంతో కీలక పాత్ర పోషించబోతున్నాయి.**

ముష్కరుల గుండెల్లో వణుకు పుట్టించడం తథ్యమని నిపుణులు అంటున్నారు. భూఉపరితలంతోపాటు ఆకాశంలో శత్రువుల ఉనికిని గుర్తించి, దాడి చేయడంలో అడ్వాన్స్‌డ్ టార్గెటింగ్ సిస్టమ్స్‌తో కూడిన ఈ హెలికాప్టర్లకు తిరుగులేదని చెబుతున్నారు. అమెరికా సైన్యంలో వీటి శక్తిసామర్థ్యాలు నిరూపితం కావడంతో కొనుగోలు చేసేందుకు ఎన్నో దేశాలు ఆసక్తి చూపుతున్నాయని బోయింగ్ సంస్థ తెలియజేసింది.

ఏహెచ్-64ఈ అపాచీ అటాక్ హెలికాప్టర్లలో తుపాకులు, రాకెట్లు, క్షిపణుల వంటి బహుళ ఆయుధాలు అమర్చారు. 30 ఎంఎం ఎం230 చైన్ గన్, 70 ఎంఎం హైడ్రా రాకెట్లు ఇందులో అంతర్భాగమే. తక్కువ దూరం, ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలపై సులువుగా దాడి చేయొచ్చు.

గంటకు 365 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. 480 కిలోమీటర్ల పరిధిలో పనిచేయగలవు. ఆటోమేటిక్ చైన్ గన్ నిమిషానికి 625 రౌండ్లు పేల్చగలదు.

ఇక ఏజీఎం-114 హెల్‌ఫైర్ క్షిపణులతో భూమిపై ఆరు కిలోమీటర్ల దూరంలోని సాయుధ వాహనాలు, యుద్ధ ట్యాంక్‌లను సైతం ధ్వంసం చేయొచ్చు.

గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే స్ట్రింగర్ మిస్సైళ్లు మరో ప్రత్యేకత. గాలిలో ప్రయాణిస్తుండగానే శత్రుదేశాల హెలికాప్టర్లు, మానవ రహిత వాహనాలను కూల్చేయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే అపాచీలు శత్రువులపై నిప్పుల వర్షం కురిపించి, తుత్తునియలు చేయగలవు.

అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేయడం మరో ప్రత్యేకత. పగలు, రాత్రి, వర్షంలో, దుమ్ములో, ధూళిలో, పొగలో... భౌగోళిక పరిస్థితులు ఎలా ఉన్నా ముందుకు దూసుకెళ్లి దాడి చేసేలా ఇందులో సెన్సార్లు, టార్గెటింగ్ వ్యవస్థలు ఉన్నాయి.

సంక్లిష్టమైన యుద్ధ వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తాయి. దృఢమైన నిర్మాణం కావడంతో శత్రువుల దాడిని తట్టుకుంటాయి. చిన్నపాటి ఆయుధాలు ప్రయోగించినా ఏమాత్రం చెక్కుచెదిరే ప్రసక్తే ఉండదు. అపాచీలో ఇద్దరు ప్రయాణించవచ్చు. ఒకరు పైలట్‌గా వ్యవహరిస్తారు. మరొకరు ఆయుధ వ్యవస్థను నియంత్రిస్తారు.

అపాచీ హెలికాప్టర్లు అమెరికా సైన్యంలో గత 40 ఏళ్లుగా సేవలందిస్తున్నాయి. 1980వ దశకం తర్వాత కీలకమైన ఆపరేషన్లలో పాల్గొన్నాయి. విశ్వసనీయత, ప్రభావశీలతను నిరూపించుకున్నాయి.

## రేపటి నుంచి ప్రధాని మోడీ విదేశీ పర్యటన



**ఈ కబురు: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జులై 23 నుంచి 26 వరకు బ్రిటన్ (జులై 23-24), మాల్దీవుల (జులై 25-26)లో నాలుగు రోజుల అధికారిక పర్యటన చేయనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్యం, భద్రత, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. బ్రిటన్, భారత్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం , ఆర్థికం, సాంకేతికత, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య, అంతర్జాతీయ అంశాలపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తో మోడీ చర్చలు జరపనున్నారు.**

**ఇక మాల్దీవుల ప్రెసిడెంట్ మహ్మద్ మొయిజ్జు ఆహ్వానంపై హిందూ-మాల్దీవుల హర్తరాఫ్ ఇకనామిక్ అండ్ మారిటైమ్ సెక్యూరిటీ పార్టనర్‌షిప్‌ను సమీక్షిస్తూ... మాల్దీవ్స్ 60వ స్వాతంత్ర్య దినోత్సవంలో "గౌరవ అతిథి"గా పాల్గొని, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను బలపరచనున్నారు.**

మొదటి పేజీ తరువాయి

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల




పేపర్ 1కి 47,224 మంది అభ్యర్థులు హాజరుకాగా..29,043 మంది (61.5 శాతం) అర్హత సాధించారు. పేపర్2 గణితం సైన్స్‌కి 48,998 మంది హాజరుకాగా.. 17,574 మంది క్వాలిఫై అయ్యారు. సోషల్ సైన్స్‌కి 41,207 మంది హాజరుకాగా..13,075 మంది అర్హత సాధించినట్టు విద్యాశాఖ పేర్కొంది. రెండు పేపర్లు కలిపి 90,205 మంది హాజరుకాగా.. 30,649 మంది (33.98 శాతం) అర్హత సాధించినట్టు ప్రకటించింది. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ సహా పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణాలు... 200 కోట్లు



జీరో టికెట్లు.. రీయింబర్స్‌మెంట్: మహిళలకు ఆర్టీసీ 'జీరో' టికెట్లను జారీ చేస్తోంది. టికెట్ల ఛార్జీల్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. నెలకు రూ.358.79 కోట్ల చొప్పున 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.4,305.49 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది.

పథకం విజయవంతం ఆనందకరం

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉంది. లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు నా అభినందనలు. పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులకు, సిబ్బందికి, యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు.

'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి

నేడు డిపోలు, బస్‌స్టేషన్లలో సంబరాలు: పొన్నం

రాష్ట్రవ్యాప్తంగా 97 డిపోలు, 341 బస్‌స్టేషన్లలో బుధవారం సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సంబరాలకు స్థానిక ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్లు, వీఐపీలను ఆహ్వానించాలని ఆర్టీసీకి సూచించారు. 'మహాలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 48 గంటల్లోనే ఆర్టీసీ సిబ్బంది సమర్థంగా అమలు చేసి చూపారు. రోజూ సగటున 35 లక్షల మంది మహిళలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారు' అని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

నన్ను పార్టీకి దూరం చేసే అధికారం మీకెక్కడిది

మురళీధరన్‌ను ప్రశ్నించిన శశిథరూర్

ఢిల్లీ: తనను పార్టీ కార్యకలాపాలకు దూరం పెడతామంటూ కేరళకు చెందిన కాంగ్రెస్ నేత మురళీధరన్ చేసిన వ్యాఖ్యలపై తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ స్పందించారు. అలా చెప్పడానికి ఆయనకు ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. ఇటీవల శశిథరూర్ మాట్లాడుతూ... పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని పలుమార్లు ఉద్ఘాటించారు. దీనికి మురళీధరన్ స్పందిస్తూ.. శశిథరూర్ తన తీరు మార్చుకునే వరకు తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించబోమన్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై థరూర్ మాట్లాడుతూ... ఇలాంటి వాదనలు చేయడానికి వారికి పార్టీలో ఏ అధికారం లేదంటూ మురళీధరన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు.

పథకం ప్రారంభం

2023 డిసెంబరు 9. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో 19 నెలలుగా అమలు.

రోజుకు 35 లక్షల మంది

పథకానికి శ్రీకారం చుట్టిన మొదట్లో రోజుకు సగటున 14 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేవారు. ఇప్పుడా సంఖ్య 35 లక్షలకు పెరిగింది. హైదరాబాద్ నగరంలోనే నిత్యం 8 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు.

## 5 వేల మంది తల్లులకు కేసీఆర్ కిట్ల పంపిణీ

బీసీల వంచనే కాంగ్రెస్ అసలు నైజం..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ మోసపూరిత వైఖరినే అనుసరిస్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో మంగళవారం అందుబాటులో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. "కులగణన జీవో నుంచి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. బీసీ డిక్లరేషన్ పేరుతో ఆ పార్టీ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించింది. కోర్టుల పేరుతో, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తోంది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం ప్రారంభించిన పథకాలను రద్దు చేసి.. కొత్త పథకాలు ప్రారంభించకపోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ వారికి చేస్తున్న ద్రోహమే" అని ఆరోపించారు. సమావేశంలో భారత రాష్ట్ర సమితి నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, బండా ప్రకాశ్, శ్రీనివాస్‌గౌడ్, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లదే క్రియాశీల



ఈ కబురు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి సీఎస్ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్ష చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని మంత్రులు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ప్రజాపాలనలో సీఎం సారథ్యంలో ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని మంత్రులు సూచించారు.

సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం సరఫరా:

ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు హాస్టళ్ల నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం, పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని మంత్రులు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారుడికి ఎలాంటి భారం కలగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్, శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ధన్‌ఖడ్ రాజీనామా.. కారణాలు అవేనా..?



నీతీశ్ కుమార్ కోసమే..?

బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న నీతీశ్ కుమార్‌ను తదుపరి ఉపరాష్ట్రపతిగా చేయాలన్న ఉద్దేశంతోనే ధన్‌ఖడ్ రాజీనామా చేశారనే చర్చ నడుస్తోంది. భాజపా నేతలు చేస్తున్న ప్రకటనలు దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. నీతీశ్ ఉపరాష్ట్రపతి కావడంలో తప్పేంటని బిహార్ మంత్రి నీరజ్ కుమార్ సింగ్ వ్యాఖ్యానించారు. నీతీశ్ ఆ పదవిలో ఉంటే రాష్ట్రానికి ఎంతో మంచిదని, అందరూ అదే కోరుకుంటున్నారని మరో భాజపా ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం అదే రాష్ట్రానికి చెందిన జేడీయూ నేత హరివంశ్ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్నారు. మరోవైపు నీతీశ్‌కు ఉపరాష్ట్రపతి కావాలని ఉందనే విషయంపై గతంలోనూ ఊహాగానాలు వచ్చాయి. ఇదే విషయంపై అనేక మంది ఆ పార్టీ నేతలు తమను సంప్రదించారని భాజపా మాజీ ఎంపీ, దివంగత నేత సుశీల్ కుమార్ 2022లో పేర్కొన్నారు.

అవమానంగా భావించారా..?

వర్షాకాల సమావేశాల తొలిరోజు జరిగిన పరిణామాలు కూడా ధన్‌ఖడ్ రాజీనామా వెనక కారణాలనే వాదన ఉంది. జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోరుతూ 68 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసిన నోటీసు తనకు అందిందని, దాన్ని అంగీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించడం.. అధికార పార్టీకి మింగుడుపడని విషయంగా మారినట్లు సమాచారం. ఈ అంశానికి సంబంధించి లోక్‌సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెడుతున్న సమయంలోనే రాజ్యసభ ఛైర్మన్ దీన్ని అంగీకరించడం తొందరపాటు చర్యగా అధికార పార్టీ భావించిందనే వాదన ఉంది.

సోమవారం సాయంత్రం నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు హాజరుకాకపోవడం ధన్‌ఖడ్‌కు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. దీంతో రాజ్యసభ ఛైర్మన్ సభను మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారని తెలుస్తోంది. ఇలా సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగిన పరిణామాలపైనా తాజాగా చర్చ నడుస్తోంది. ఈ అంశాలను కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రస్తావిస్తున్నాయి.

మొదటి పేజీ తరువాయి

## ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం ప్రతిష్టిస్తాం: మంత్రి జూపల్లి



**రవీంద్రభారతి, ఈ కబురు: తెలంగాణ వైతాళికుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. దీనిపై ఇప్పటికే హెచ్‌ఎండీఏకు లేఖ రాశామన్నారు. దాశరథి శత జయంతి ఉత్సవాలను మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ జనజీవన చిత్రాన్ని ఆవిష్కరించిన కవి, కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నవరం దేవేందర్‌కు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయన్ని రూ.లక్ష నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించిన తర్వాత మంత్రి జూపల్లి మాట్లాడుతూ...'దాశరథి సాహిత్యాన్ని సాంస్కృతిక శాఖ ద్వారా రాష్ట్రంలోని 12 వేల గ్రామాల్లో అందుబాటులోకి తీసుకురాబోతున్నాం' అని ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 'తెలంగాణ ఉద్యమ సమయంలో దాశరథి కవితలు, సాహిత్యం మాకెంతో స్ఫూర్తినిచ్చారు' అని అన్నారు. పురస్కార గ్రహీత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ... 'తెలంగాణ సంస్కృతిలో భాష ఎంతో ముఖ్యం. ఈ భాష సినిమాల్లో, పాటల్లో విజయవంతమైంది. ఇకపై పాఠ్యాంశాల్లోనూ తీసుకురావాలి" అని మంత్రి జూపల్లిని కోరారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ, కవులు అందెశ్రీ, జయరాజ్, యాకూబ్, సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, దాశరథి కుటుంబ సభ్యులు ఇందిర, లక్ష్మణ్, గౌరీశంకర్ పాల్గొన్నారు.**

## ఆ రాత్రి ట్రంప్ నావైపు అదోలా చూశారు: అమెరికన్ ఆర్టిస్ట్ ఆరోపణ

ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు రెండోవిడత పాలనలో కూడా ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఆగడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతున్న జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఫైల్స్ విడుదల చేస్తానంటూ ఇచ్చిన హామీ ఆయన మెడకే చుట్టుకుంటోంది. అసలు ఎప్‌స్టీన్ వ్యవహారంపై కొన్ని దశాబ్దాల క్రితమే దర్యాప్తు కోరిన మారియా ఫార్మర్ అనే అమెరికన్ కళాకారిణి తాజాగా దేశాధ్యక్షుడిపైనా సంచలన ఆరోపణలు చేశారు. ఓ సందర్భంలో ట్రంప్ తనకు ఎదురుపడగా.. అసభ్యకరంగా చూశారని పేర్కొన్నారు.

ఆ రాత్రి ఏం జరిగిందంటే..

నాటి చేదు అనుభవాన్ని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ పత్రికతో మారియా పంచుకొన్నారు. 1995లో తాను ఎప్‌స్టీన్ కోసం పనిచేయడానికి సిద్ధమవుతున్నానని చెప్పారు. ఒక రోజు బాగా పొద్దుపోయాక ఎప్‌స్టీన్ ఫోన్ చేసి తనను మాన్‌హట్టన్‌లోని ఆఫీసులో కలవాలని ఫోన్ చేసినట్లు తెలిపారు. తాను రన్నింగ్ షార్ట్స్ ధరించే ఆఫీస్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు.

అదే సమయంలో ట్రంప్ బిజినెస్ సూట్ ధరించి అక్కడికి వచ్చారని గుర్తు చేసుకొన్నారు. తనకు సమీపంలోనే ట్రంప్ నిలబడి వేచి చూస్తున్నారని చెప్పారు. ఈక్రమంలో ట్రంప్ తన కాళ్ల వైపు అదే పనిగా చూడటాన్ని గమనించినట్లు వెల్లడించారు. ఆ సమయంలో తనకు భయం వేసినట్లు మారియా పేర్కొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఎప్‌స్టీన్ " నో..నో.. ఆమె నీకోసం కాదు" అంటూ ట్రంప్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారన్నారు. ఆ సమయంలో తనకు 16 ఏళ్లు ఉంటాయని అనుకొన్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించారన్నారు. వాస్తవానికి అప్పటికే మారియా వయసు 20ల్లో ఉంది.

ఈ వ్యాఖ్యలపై శ్వేతసౌధం స్పందించింది. ఎప్‌స్టీన్‌తో స్నేహాన్ని ట్రంప్ వదిలేసి చాలాకాలం అవుతోందని పేర్కొంది. దీంతోపాటు అధ్యక్షుడు ఏనాడు ఎప్‌స్టీన్ ఆఫీస్‌కు వెళ్లలేదని పేర్కొంది. ఈ మేరకు శ్వేతసౌధం కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ వెల్లడించారు. వాస్తవానికి ఎప్‌స్టీన్ చెత్త ప్రవర్తనతో విసిగిపోయిన ట్రంప్ అతడిని తన క్లబ్ నుంచి వెళ్లగొట్టారన్నారు.

మారియా 1996లోనే ఎప్‌స్టీన్, మ్యాక్స్‌వెల్ సెక్స్ ట్రాఫికింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. నాడు ఎఫ్‌బీఐకు వీరిపై సమాచారం అందించారు. ఆ సందర్భంగా ట్రంప్ పేరును కూడా ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. 2006లో కూడా ఎఫ్‌బీఐ ఇంటర్వ్యూలో ట్రంప్ పేరును మరోసారి ఆమె ప్రస్తావించారు.



## రెండో రోజూ అదే రగడ

ఈ కబురు, న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా రెండో రోజు మంగళవారం సైతం అట్టుడికాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఆపరేషన్ సిందూర్ సహా పలు కీలక అంశాలపై విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై వెంటనే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. ఆపరేషన్ సిందూర్ సహా అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం పదేపదే ప్రకటించినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. ఆయా అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పాయి.మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు విపక్ష 'ఇండియా' కూటమి నేతలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో పాటు సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతోపాటు పహల్గాం ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రక్రియలో అమెరికా జోక్యం, నియోజకవర్గాల పునర్విభజన, దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మహిళలపై పెరుగుతున్న దౌర్జన్యాలు, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన, మణిపూర్ హింసాకాండ తదితర అంశాలపై చర్చించారు. ప్రధాని మోదీ సభకు హాజరై, వీటిపై సమాధానం ఇచ్చేలా ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. విపక్షాల భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, మాణిక్కం ఠాగూర్, రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వాయిదా తీర్మానాలు ఇచ్చారు.

విపక్ష ఎంపీల తీరుపై లోక్‌సభ స్పీకర్ ఆగ్రహం

లోక్‌సభ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. బిహార్ ఓటర్ల జాబితా సవరణతోపాటు ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాయి. నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించాయి. సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వ్యవసాయానికి సంబంధించిన కీలకమైన అంశాలు ఉన్నందు వీటిపై చర్చకు సహకరించాలని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రతిపక్షాలను కోరారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా ఆందోళన కొనసాగించడంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది.

సభ పునఃప్రారంభమైన తర్వాత విపక్షాల ఆందోళన కొనసాగింది. స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ స్పందిస్తూ... విపక్షాలు లేవనెత్తే అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సైతం మాట్లాడారు. సభకు సహకరించాలని విపక్ష సభ్యులను కోరారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సభ తిరిగి 2 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు ఆందోళన విరమించలేదు. వారి వైఖరిని స్పీకర్ తప్పుపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చ జరగకుండా సభా సమయాన్ని వృథా చేస్తున్నారని మండిద్దారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో సభ బుధవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. వాయిదా తీర్మానం నోటీసులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించడం పట్ల విపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. సభ తొలుత 12 గంటలకు వరకు, తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఎగువ సభ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఓటర్ల హక్కులు కాలరాస్తున్నారు

పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన తర్వాత విపక్ష ఎంపీలు పార్లమెంట్ మకరద్వారం మెట్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు



## మిగ్ 21' సేవలకు ముగింపు.. దాని స్థానంలో



**ఈ కబురు: భారత వైమానిక దళంలో 62 ఏళ్ల పాటు సేవలందించిన మిగ్-21 యుద్ధ విమానాలకు త్వరలోనే వీడ్కోలు పలకనున్నట్టు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తెలిపింది. సెప్టెంబర్ 19న చండీగఢ్ ఎయిర్‌బేస్‌లో యుద్ధ విమానానికి వీడ్కోలు కార్యక్రమం జరుగుతుంది. దీని తర్వాత ఆ విమాన సేవలు అధికారికంగా ముగుస్తాయి. ఈ విమానాలు తరచూ ప్రమాదాలకు గురవుతుండటంతో తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వీటి స్థానంలో దేశీయంగా తయారు చేసిన తేలికపాటి యుద్ధ విమానాలు ఎంకే1ఏతో భర్తీ చేయనున్నారు. కాగా, మిగ్ 21 జెట్‌ను తొలిసారిగా 1963లో భారత వైమానిక దళంలో చేర్చారు. ఇది భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ జెట్.1965,1971లో జరిగిన భారత్ పాక్ యుద్ధాలు, 1999 కార్గిల్ వార్, 2019 బాలకోట్ దాడులు, ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లలో ఈ ఫైటర్ జెట్ కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల కాలంలో ఈ విమానం తరచుగా ప్రమాదాలకు గురైంది. 400 కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ క్రమంలోనే వీటిని సైన్యం నుంచి తొలగించాలని కేంద్రం భావిస్తోంది. భారతదేశం 900 మిగ్-21 యుద్ధ విమానాలను కొనుగోలు చేసింది. వీటిలో 660 విమానాలను హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ దేశీయంగా తయారు చేసింది. ప్రస్తుతం వైమానిక దళంలో 36 మిగ్-21 యుద్ధ విమానాలుఉన్నాయి. ఇది అనేక దశాబ్దాలుగా అద్భుతమైన సేవలను అందించాయి.**

## వినియోగదారుడే రారాజు



ఈ కబురు, దిల్లీ: భోజనం చేయడానికి ఏ హోటల్‌ను ఎంచుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వినియోగదారులకే ఉంటుందని, ఆ విషయంలో వారే రారాజులని సుప్రీంకోర్టు పేర్కొంది. గతంలో మాంసాహారాన్ని అందుబాటులో ఉంచిన హోటల్.. వ్యాపారాభివృద్ధి కోసం శాకాహారాన్నీ సరఫరా చేస్తుంటే అక్కడకు వెళ్లాలో వద్దో నిర్ణయించుకోవాల్సింది వినియోగదారులేనని తెలిపింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాల్సిన బాధ్యత హోటల్ నిర్వాహకులపై ఉంటుందని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అభిప్రాయపడింది. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కావడి యాత్రా మార్గం వెంబడి హోటళ్ల యజమానులు తమ వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను పాటించాలని మంగళవారం స్పష్టం చేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా హోటల్ యజమానుల లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వివరాలు వినియోగదారులకు తెలిసిపోతాయి.

మొదటి పేజీ తరువాయి

శ్రావణ మాసంలో భక్తులు కావళ్లలో గంగా జలాన్ని తీసుకుని శివాలయాలలో అభిషేకాలు చేస్తారు. ఈ మాసంలో చాలామంది భక్తులు మాంసాహారం భుజించరు. ఉల్లి, వెల్లుల్లి కలిసిన శాకాహారాన్ని కూడా తీసుకోరనే విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. మంగళవారం కావడి యాత్ర ముగింపు దినం కాబట్టి హోటల్ యజమానులు ప్రభుత్వ ఉత్తర్వులను పాటించాల్సిందేననీ, ఇతర అంశాల జోలికి తాము ఇప్పుడు పోదలచుకోలేదని తెలిపింది. ఒక హోటల్ యజమాని గతంలో మాంసాహారం వడ్డించి, కావడి యాత్రా సందర్భంగా వ్యాపారం పెంచుకోవడానికి శాకాహారం వడ్డించవచ్చనీ, అలాంటి హోటల్‌లో ఆహారం తీసుకోవాలా వద్దా అన్నది తేల్చుకునే హక్కు, అధికారం వినియోగదారుకు ఉండాలని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ పేర్కొన్నారు. కావడి యాత్రా మార్గం వెంబడి మైనారిటీలు నడిపే హోటళ్లపై రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఉత్తర్వు ద్వారా దుర్విచక్షణ ప్రదర్శిస్తోందని పిటిషనర్ల న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి ఆరోపించారు.పార్టీల జెండాల్లో త్రివర్ణంపై పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలు తమ జెండాల్లో త్రివర్ణ పతాకాన్ని వాడుకుంటుండటంపై చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను పరిగణనలో తీసుకునేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలికవర్గాలు వంటివి జాతీయ పతాకాన్ని కాస్త తేడాతో తమ జెండాల్లో వాడుతున్నాయని, అశోక చక్రం బదులు పార్టీ గుర్తులను చేరుస్తున్నాయని సంజయ్ భీమ్‌శంకర్ థోబ్డే అనే వ్యక్తి దీనిని దాఖలుచేసి స్వయంగా వాదనలు వినిపించడానికి హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని గౌరవించే చట్టాన్ని ఈ పార్టీలు ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొన్ని పార్టీలు ఇలాగే చేస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించి పిల్ స్వీకరణకు నిరాకరించింది.



# లాభాల్లో ప్రారంభమై... ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** క్యూ1 ఫలితాల జోష్‌తో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అయితే, అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాక పోవడం, ట్రంప్ నిర్దేశించిన గడువు ఆగస్టు 1 దగ్గర పడుతుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 82,527.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,200.34) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,110.63 82,538.17 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టైటాన్, బీఈఎల్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.49 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,396 డాలర్ల వద్ద కొనసాగుతోంది.







# 11 వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించిన గూగుల్

వివిధ దేశాలకు సంబంధించి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపిస్తూ.. గూగుల్ దాదాపు 11వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించింది. వీటిలో చైనా , రష్యాకు చెందిన ఛానళ్లు టాప్ లిస్టులో ఉన్నట్లు వెల్లడించింది. తొలగించిన వాటిలో కేవలం చైనాకు సంబంధించినవే 7,700 యూట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు తెలిపింది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ పలు కంటెంట్‌లను పోస్టు చేస్తున్నాయని ఆరోపించింది.

రష్యాకు చెందిన 2,000లకు పైగా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర వెబ్‌సైట్లను తొలగించినట్లు గూగుల్ వెల్లడించింది. ఈ ఖాతాల్లో ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా సందేశాలను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. రష్యాలోని పలు సంస్థలకు కూడా ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. ఇటీవల గూగుల్ 20 యూట్యూబ్ ఛానెల్‌లు, నాలుగు ఖాతాలు, రష్యా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థకు సంబంధించిన ఓ బ్లాగును తొలగించినట్లు వివరించింది.

చైనా, రష్యాలతో పాటు ఇరాన్, తుర్కియే, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య వార్తలు ప్రసారం చేస్తున్నందువల్ల వాటిని నిలువరించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 2025 మొదటి త్రైమాసికంలో గూగుల్ 23,000లకు పైగా ఖాతాలను తొలగించింది. మెటా సైతం ఇటీవల దాదాపు 10 మిలియన్ల నకిలీ ప్రొఫైల్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.

# మీ పాన్ కార్డుపై మరెవరైనా లోన్ తీసుకున్నారా? చెక్ చేసుకోండిలా!




మీ పేరు మీద లోన్ లేకపోయినా మీ పాన్ నంబర్ దుర్వినియోగానికి గురై ఉండే అవకాశం ఉంటుంది. క్రెడిట్ రిపోర్టులో 'హార్డ్ ఎంక్వైరీ'లు ఉన్నాయేమో చూడండి. అనుమానాస్పద సంస్థల నుంచి వచ్చిన ఎంక్వైరీలు కనిపిస్తే వెంటనే ఆ బ్యూరోకు ఫిర్యాదు చేయాలి. హార్డ్ ఎంక్వైరీలు కూడా మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

**డిజిటల్ మోసాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇతరుల వివరాలతో కొందరు లోన్‌లు తీసుకుంటున్న ఉదంతాలూ వెలుగుచూస్తున్నాయి. అలా మీ పాన్ వివరాలతో ఎవరైనా లోన్ తీసుకున్నట్లయితే మీ క్రెడిట్ స్కోర్, రుణ సామర్థ్యంపై ప్రభావం పడుతుంది. అందువల్ల మీ పేరుపై అలాంటి రుణాలు ఏవైనా ఉన్నాయా? లేదా? అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇంతకీ దీన్ని చెక్ చేసుకోవడం ఎలాగంటే..?**

మీ పాన్ వివరాలతో రుణాలు ఉన్నాయో, లేదో తెలుసుకోవడానికి ముందుగా క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించాలి. సిబిల్ , ఈక్విఫాక్స్ , ఎక్స్‌పీరియన్ వంటి క్రెడిట్ బ్యూరోలు మీ పాన్ ఆధారంగా క్రెడిట్ రిపోర్ట్‌ను జారీ చేస్తాయి. ఇందులో మీరు తీసుకున్న లోన్లు, క్రెడిట్ కార్డు లావాదేవీల సమాచారం ఉంటుంది.

**ఫిర్యాదు చేయండి..**

మీ పేరు మీద ఏవైనా రుణాలున్నట్లు కనబడితే వెంటనే బ్యాంకును సంప్రదించండి. బ్యాంక్ మేనేజర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయండి. తీసుకున్న లోన్ మీకు సంబంధించినది కాదని వివరంగా రాసిచ్చి తీసుకోండి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయండి. మోసం జరిగిందని అధికారికంగా రికార్డ్ చేయించడానికి, తదుపరి చర్యలకు ఇది ఉపయోగపడుతుంది. రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్‌కు కూడా ఇమెయిల్ చేయండి.

పాన్ దుర్వినియోగాన్ని ఎలా నివారించాలి?

పాన్, ఆధార్ వివరాలు చాలా సందర్భాల్లో వినియోగించాల్సి వస్తుంది. అందువల్ల, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండడం ముఖ్యం. ఎవరికి పడితే వారికి వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేయొద్దు. అనధికారిక వెబ్‌సైట్లలో పాన్ వివరాలను అప్‌లోడ్ చేయడం, అనుమానాస్పద రిటైలర్లకు ఇవ్వడం వంటివి చేయకండి. మీ పాన్‌కార్డు పోయినట్లయితే వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోండి. కొన్నినెలలపాటు ఆ కార్డు దుర్వినియోగం అయ్యిందేమో రివ్యూ చేసుకోండి. బ్యాంకింగ్ యాప్‌లకు, లోన్ అప్లికేషన్లకు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టండి. 2ఫ్యాక్టర్ అథంటికేషన్, ఎస్సెమ్మెస్/ఇమెయిల్ నోటిఫికేషన్‌లను ఆన్‌లో పెట్టుకోండి.




# జీమెయిల్‌లో కొత్త ఫీచర్.. ప్రమోషనల్ మెయిల్స్‌కు ఒక్క క్లిక్‌తో చెక్!

గూగుల్‌కు చెందిన ఇమెయిల్ సర్వీస్ జీమెయిల్‌లో కొత్త ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. సబ్‌స్క్రిప్షన్‌లను ఒకే చోట నిర్వహించేందుకు వీలుగా మేనేజ్ సబ్‌స్క్రిప్షన్ పేరిట దీన్ని తీసుకొచ్చారు. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ప్రమోషనల్ ఇ-మెయిల్స్ అన్నింటినీ ఒకేచోట చూడొచ్చు. అవసరం లేదనుకుంటే ఒకే క్లిక్‌లో అన్‌సబ్‌స్క్రైబ్ చేయొచ్చు. మీకు నచ్చని ప్రమోషనల్ ఇ-మెయిల్స్ భవిష్యత్‌లో మీ ఇన్‌బాక్స్‌లోకి రాకుండా ఈ ఫీచర్ ద్వారా నియంత్రించుకోవచ్చని గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. వెబ్, ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌కు అందుబాటులోకి తెచ్చినట్లు గూగుల్ తెలిపింది.

జీమెయిల్ సైడ్ మెనూలో ట్రాష్ ఫోల్డర్ కింద ఈ మేనేజ్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కనిపిస్తుంది. దీనిలో మీ యాక్టివ్ ఇ-మెయిల్ సబ్‌స్క్రిప్షన్లు అన్నింటినీ చూపిస్తుంది. న్యూస్‌లెటర్స్, ప్రమోషనల్ మెసేజ్‌లు, డీల్ అలర్ట్స్ వంటివన్నీ ఇందులో ఉంటాయి. మీకు ప్రతి సెండర్ నుంచి ఎన్నిసార్లు మెయిల్స్ వస్తున్నాయన్న వివరాలతో పాటు, ఎక్కువగా మెయిల్స్ పంపేవారిని హైలైట్ చేస్తుంది. మెయిల్‌పై ట్యాప్ చేస్తే, ఆ సెండర్ నుంచి వచ్చిన అన్ని ఇ-మెయిల్స్ కనిపిస్తాయి. వాటి పక్కన అన్‌సబ్‌స్క్రైబ్ బటన్ కనిపిస్తుంది. ఈ సదుపాయం వల్ల ఇంతకుముందులా మెయిల్ చివర ఉండే చిన్న లింక్‌ను వెతకాల్సిన అవసరం లేకుండా జీమెయిల్ స్వయంగా అన్‌సబ్‌స్క్రైబ్ అభ్యర్థన పంపుతుంది. ఈ ఫీచర్‌ను తొలుత పరిమిత యూజర్లతో ఏప్రిల్‌లో పరీక్షించారు. ఇప్పుడు దీన్ని అధికారికంగా విడుదల చేశారు. జీమెయిల్ యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. మీ మెయిల్ ఓపెన్ చేసి ఓ సారి చెక్ చేయండి. అక్కర్లేని మెయిల్స్‌కు ఇవాళే స్వస్తి పలకండి.




# టెక్ పరధ్యానం వదిలించుకోవాలంటే..? గూగుల్

**రోజురోజుకూ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. సరికొత్త ఫీచర్లతో సోషల్ మీడియా యువతను తన వల నుంచి బయటపడనివ్వడం లేదు. మరోపక్క నోటిఫికేషన్ల జడివాన. ఇవన్నీ నెటిజన్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏదైనా ఒక అంశంపై శ్రద్ధపెట్టనివ్వకుండా టైమ్ తినేస్తున్నాయి. మరి దీనినుంచి ఎలా బయటపడాలి..? ఇదే విషయంపై సలహా ఇచ్చారు గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ ష్మిత్ .**




డిజిటల్ ప్రపంచంలో ఏ విషయంపై కూడా ఎక్కువగా శ్రద్ధ పెట్టలేకపోతున్న విషయం వాస్తవమని ఎరిక్ అంగీకరించారు. ''20 నుంచి 29 ఏళ్ల మధ్యలో ఉన్న కొందరు యువతతో నేను పనిచేస్తున్నాను. మైండ్‌ను పక్కదారి పట్టించే ఇన్ని అంశాల మధ్య పనిచేయడం ఎలా అని వారు నన్ను ప్రశ్నించారు. దానికి నేను చెప్పే సమాధానం ఒక్కటే. మీ ఫోన్‌ను ఆఫ్ చేయండి'' అని సలహా ఇచ్చారు.

ప్రకటనలు, వినోదం, సబ్‌స్క్రిప్షన్ ఇవన్నీ మనుషుల దృష్టిని మరల్చేలా రూపొందించినవేనని వెల్లడించారు. 70వేల ఏళ్లుగా మనిషి ఎలాంటి సమాచార పరికరాలు లేకుండా విశ్రాంతి పొందారని చెప్పారు. ఈ టెక్ ప్రపంచంలోనే ఎక్కువగా ఉండిపోతే.. ఆలోచన సామర్థ్యం పడిపోతుందని, మునుపటి విషయాలను గుర్తుతెచ్చుకోవడంలో తడబడుతుంటారని, ఆందోళన పెరుగుతుందని పలువురు నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయం తెలిసిందే.

అదే సమయంలో టెక్నాలజీని సరిగా సద్వినియోగం చేసుకోకపోతే.. ఉపాధి అవకాశాల్లో వెనకబడిపోతారని సూచిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం స్క్రోలింగ్ చేయడం తగ్గించి, దానికి బదులుగా ఏఐ టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సంపాదించడంపై దృష్టి పెట్టాలని పర్‌ప్లెక్సిటీ సీఈవో అరవింద్ శ్రీనివాస్ యువతకు సలహా ఇచ్చిన సంగతి తెలిసిందే. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత ఏఐ యుగంలో మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలోనే భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ''సాంకేతికతతో పాటు వృద్ధి చెందడం అంతతేలికైన పని కాదు.'' అని చెప్పారు.




# పేటీఎం పంట పండింది!

డిజిటల్ చెల్లింపుల కంపెనీ పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.122.5 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కొన్ని త్రైమాసికాల నుంచి నష్టాలను పోస్ట్ చేస్తోన్న సంస్థ చాలా రోజుల తర్వాత లాభాలను రిపోర్ట్ చేసింది. కంపెనీ ఎంప్లాయ్ స్టాక్ ఆపరేషన్ ప్లాన్(ఇఎస్‌ఓపీ)లో గణనీయమైన సర్దుబాట్ల వల్ల ఇది సాధ్యమైందని కంపెనీ తెలిపింది.

కంపెనీ వార్షికంగా 28% ఆదాయ పెరుగుదలను నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో రూ.1,917 కోట్లు సమకూరినట్లు చెప్పింది. ఇది దాని చెల్లింపులు, ఆర్థిక సేవల విభాగాల్లో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తుంది. 2021లో పబ్లిక్ లిస్టింగ్ తర్వాత వన్ 97 కమ్యూనికేషన్స్‌కు ఇది మెరుగైన క్వార్టర్లలో ఒకటి. కొన్నేళ్లుగా వస్తున్న నష్టాల తర్వాత వ్యయ నియంత్రణ, ప్రధాన సర్వీసుల్లో పెరుగుతున్న మానిటైజేషన్‌తో కంపెనీ స్థిరపడుతున్నట్లు చెప్పింది.


తక్కువ నిర్వహణ ఖర్చులు, మర్చంట్ సబ్‌స్క్రిప్షన్‌లు, డివైజ్ ఇన్‌స్టలేషన్ నిరంతర విస్తరణ లాభాలకు ఎంతో తోడ్పడిందని కంపెనీ తెలిపింది. పేటీఎం చెల్లింపుల మౌలిక సదుపాయాలు, ఆర్థిక సేవల పంపిణీ నుంచి బలమైన సహకారం లభించినట్లు చెప్పింది. ఎగ్జిక్యూటివ్ పరిహారం, ఈఎస్‌ఓపీ గవర్నెన్స్‌కు సంబంధించి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించడానికి వన్ 97 కమ్యూనికేషన్స్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. కంపెనీ ఎండీ, సీఈఓ విజయ్ శేఖర్ శర్మకు ఇచ్చిన 21 మిలియన్ స్టాక్ ఆప్షన్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

# ప్రభుత్వ సర్వీసులకు ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యం

ప్రభుత్వ సేవల్లో ఉత్పాదకతను పెంచేందుకు కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించేలా చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం ఓపెన్‌ఏఐ ప్రభుత్వ డేటాను యాక్సెస్ చేసే అవకాశం ఏర్పడుతుంది. విద్య, రక్షణ, భద్రత, న్యాయ వ్యవస్థలో ఉపయోగించే ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌ల్లో ఏఐ ఆధారిత కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నట్లు ఇరు వర్గాలు తెలిపాయి.

యూకేలో మార్పు తీసుకురావడానికి, ఆర్థిక వృద్ధిని మెరుగు పరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకం కానుందని ప్రభుత్వ టెక్నాలజీ సెక్రటరీ పీటర్ కైల్ అన్నారు. ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను స్వీకరించడం ద్వారా గతంలో స్థానిక సంగీతకారుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఏఐ టూల్స్ తమ సంగీతాన్ని లైసెన్స్ లేకుండా ఉపయోగించడాన్ని వారు వ్యతిరేకించారు.

ప్రస్తుతం ప్రాథమికంగా 100 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న లండన్ కార్యాలయంలో ఓపెన్ ఏఐ సర్వీసులను విస్తరించనుంది. క్రమంగా ఏఐ సేవలు ఇతర విభాగాలకు వ్యాపిస్తాయని ఇరు వర్గాలు తెలిపాయి. ఓపెన్‌ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. దీని ద్వారా అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఏఐ అనేది దేశ నిర్మాణానికి కీలకమైన సాంకేతికత అని తెలుపుతూ, ఇది ఆర్థిక వ్యవస్థలను మారుస్తుందని చెప్పారు.






# 'రామాయణ' చరిత్ర సృష్టిస్తుంది: దర్శకుడు అశ్విన్ కుమార్

బాలీవుడ్‌లో తెరకెక్కుతోన్న 'రామాయణ' ఇండస్ట్రీని ఒక మలుపు తిప్పుతుందన్నారు దర్శకుడు అశ్విన్ కుమార్ . ఆయన దర్శకత్వం వహించిన 'మహావతార్: నరసింహ' జులై 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మైథలాజికల్ సినిమాల గురించి మాట్లాడారు. ''ఆదిపురుష్' వైఫల్యానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. దీన్ని నేను ఇప్పుడు మళ్లీ వివరించలేను. కానీ, వారు ఆ చిత్రం ద్వారా ఏం చెప్పాలనుకున్నారో నాకు అర్థమైంది. దానినుంచి ఇండస్ట్రీ ఎన్నో పాఠాలు నేర్చుకుంది. అదే ముగింపు కాదు. ఇలాంటి గొప్ప కథలను ఎన్నిసార్లు రూపొందించినా ప్రేక్షకులు ఆసక్తిగానే చూస్తారు. ఇప్పుడు ఇదే కథపై బాలీవుడ్‌లో రామాయణ వస్తుంది. అందరి ఆశలు ఈ చిత్రం పైనే ఉన్నాయి. అది ఇండస్ట్రీలో చరిత్ర సృష్టిస్తుందనే నమ్మకం నాకు ఉంది. సినిమాకు బడ్జెట్ మాత్రమే ప్రామాణికం కాదు. కథను ఎలా చూపిస్తామనేది ముఖ్యం. 'మహావతార్: నరసింహ' ముఖ్య ఉద్దేశం అదే. ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది. పురాణాల ఆధారంగా తెరకెక్కించే కథలకు త్వరలోనే డిమాండ్ ఏర్పడనుంది'' అంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా ఏడు సినిమాలను అందించనున్న విషయం తెలిసిందే. విష్ణుమూర్తి పది అవతారాలపై సినిమాలను నిర్మించనుంది. దీనిలో భాగంగానే రానున్న మొదటి చిత్రమే 'మహావతార్: నరసింహ'. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ విడుదల కానుంది.

# 'హరి హర వీరమల్లు: పార్ట్2'పై పవన్ ఏమన్నారంటే..

**అమరావతి:** 'హరి హర వీరమల్లు: పార్ట్2' షూటింగ్ 2030శాతం పూర్తయిందని అగ్ర కథానాయకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన కీలక పాత్రలో నటించిన 'హరి హర వీరమల్లు: పార్ట్1 స్వోర్డ్ vs స్పిరిట్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా మంగళగిరిలో విలేకరులతో ముచ్చటించారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ 'పార్ట్2'ను వచ్చే డబ్బులు, తనకున్న సమయాన్ని బట్టి చేస్తామని చెప్పారు. అందుకు భగవంతుడి ఆశీస్సులు కూడా కావాలని సమాధానమిచ్చారు. చిత్ర పరిశ్రమ ఎక్కడ ఉన్నా సమస్య లేదని, అయితే, ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాలతో పాటు, ఫిల్మ్ మేకింగ్ స్కూల్‌ను కూడా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

''ఇక్కడి నుంచి బలవంతంగా తీసుకెళ్లిపోయిన కోహినూర్ వజ్రాన్ని తీసుకొచ్చే వీరుడి కథ ఇది. 'హరి హర వీరమల్లు' పూర్తి ఫిక్షనల్ స్టోరీ. 'సర్వాయి పాపన్న' కథతో దీనికి సంబంధం లేదు. రెండు సార్లు కరోనా కష్టాలు, ఆ తర్వాత ఏపీలో రాజకీయ డిజాస్టర్ వల్ల నేను సినిమాలపై దృష్టి పెట్టలేకపోయాను. దీంతో నా నిర్మాతలు ఇబ్బంది పడ్డారు. దానికి నైతిక బాధ్యత వహించి ఈ సినిమాకు ప్రమోషన్ చేస్తున్నా. ఈ మూవీకి రెమ్యునరేషన్ కూడా లేదు. (నవ్వులు) 'జిజియా పన్ను'పై ఓ ఎపిసోడ్ ఉంటుంది. అదే సమయంలో రాజకీయాలకు అతీతంగా ఉంటుంది. దానిలో ధర్మం అనేది ఒక ఎలిమెంట్ మాత్రమే. సినిమాలా? రాజకీయాలా? అంటేనా మొదటి ప్రాధాన్యం రాజకీయాలకే''

''భీమ్లానాయక్'కు టికెట్ ధరలు తగ్గించినప్పుడు నేను, నిర్మాత ఇద్దరం నష్టపోయాం. సినిమా బాగుందంటే ఆనందిస్తా. బాగోలేకపోతే, ఎక్కడ తప్పు జరిగిందో పరిశీలిస్తా. సినిమా విడుదలైన తర్వాత ఎప్పుడూ ఒంటరిగానే ఉంటా. నా ఎమ్మెల్యేల అందరికీ వాళ్లు కోరుకుంటే ప్రత్యేక షో వేస్తాం. ఫిల్మ్ ఇండస్ట్రీ చాలా గ్లామరస్‌గా కనిపిస్తుంది. వరుస విజయాల తర్వాత 'జానీ' చేస్తే ఆడలేదు. ఫైనాన్షియర్లు అందరూ నా ఇంటికి వచ్చారు. నా పారితోషికం తిరిగి ఇచ్చేశా. దాంతో పాటు, మరో రూ.15లక్షలు అప్పులు చేసి మరీ ఇచ్చాను. ఆ మూవీ నాకు రాజకీయాల్లో బాగా ఉపయోగపడింది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు బలంగా నిలబడ్డా. కింది స్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి ఏఎం రత్నం. ఆయనకు అండగా నిలబడాలనే ఈ సినిమాను దగ్గరుండి విడుదల చేస్తున్నా'' అని పవన్‌కల్యాణ్ అన్నారు.






# ఓటీటీ ప్రేక్షకుల కోసం మరో సరికొత్త టాక్ షో 'టూమచ్'

ఒకప్పుడు టెలివిజన్ వేదికగా ట్రెండ్ సృష్టించిన టాక్‌షోలకు ఇప్పుడు ఓటీటీలు వేదికలవుతున్నాయి. సరికొత్త అంశాలు, ప్రజెంటేషన్‌తో టాక్ షోలు ముందుకు వస్తున్నాయి. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి మరో టాక్ షో సిద్ధమవుతోంది. బాలీవుడ్ కథానాయికలు కాజోల్, ట్వింకిల్ ఖన్నా వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్న షో 'టూమచ్' . ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ షో స్ట్రీమింగ్ కానుంది. బాలీవుడ్ నటులతో పాటు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఈ షోకు రానున్నారు. వ్యక్తిగత జీవితాలతో పాటు, కెరీర్‌లో వాళ్లు ఎదుర్కొన్న సవాళ్లు, చూసిన ఎత్తుపల్లాలను, వాళ్ల బంధాలను ఇలా చాలా విషయాలపై ఈ షోలో మాట్లాడనున్నారు. త్వరలోనే ఈ షో స్ట్రీమింగ్ తేదీని అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రకటించనుంది.




# 'పెద్ది' కోసం రామ్‌చరణ్ ట్రాన్స్‌ఫర్మేషన్.. ఫొటో వైరల్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ది' . ఈ సినిమా కోసం అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇందులో చరణ్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం తాను వర్క్‌వుట్స్ చేస్తున్నట్లు తెలుపుతూ రామ్ చరణ్ ఓ ఫొటో షేర్ చేశారు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది.

జిమ్‌లో వర్క్‌వుట్స్ చేస్తోన్న ఫొటోను షేర్ చేసిన ఆయన .."పెద్ది కోసం మారుతున్నాను ఇలా.. దృఢమైన సంకల్పం.. గొప్ప ఆనందం" అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన న్యూలుక్ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ 'పెద్ది' గ్లింప్స్‌లోని కొన్ని సన్నివేశాలతోనే పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై ప్రత్యేకమైన ఉత్సుకతని రేకెత్తించింది చిత్రబృందం. అందుకు దీటుగానే బుచ్చిబాబు సినిమాని రూపొందిస్తున్నారు. తాజాగా చెర్రీ లుక్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి .

రామ్‌చరణ్ 16వ చిత్రంగా 'పెద్ది' సిద్ధమవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. శివరాజ్ కుమార్ గౌరాన్నాయుడుగా కనిపించనున్నారు. జగపతిబాబు, దివ్యేందు శర్మ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఫిక్షనల్ కథతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్టు బుచ్చిబాబు ఓ సందర్భంలో చెప్పారు. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉండనుంది. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.




# వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఒడుదొడుకులు.. రష్మి కీలక నిర్ణయం

**హైదరాబాద్: వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని తెలియజేయడంతో పాటు, సరికొత్త స్టిల్స్ పంచుకుని అభిమానులను అలరిస్తుంటారు యాంకర్, నటి రష్మి గౌతమ్ . తాజాగా ఆమె పంచుకున్న ఓ పోస్ట్ అభిమానులను ఆశ్చర్యపరిచింది. 'ఏదీ శాశ్వతం కాదు. ఈ కాలం కూడా గడిచిపోతుంది. మళ్లీ కలుద్దాం' అంటూ ఆమె ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. కొన్నాళ్ల పాటు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.**

''హలో ఆల్.. ఒక నెల రోజుల పాటు డిజిటల్ డీటాక్స్ పాటించాలని అనుకుంటున్నా. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కొన్ని ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాను. సోషల్ మీడియా అందులో భాగమే. కొన్నిసార్లు అది మన ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఒక విషయమైతే వాగ్దానం చేస్తున్నా. కచ్చితంగా నేను మరింత దృఢంగా తిరిగి వస్తా. నేను నా శక్తియుక్తులను పునరుద్ధరించుకోవాలి. ఎలాంటి ప్రేరణ, డిజిటల్ ప్రభావం లేకుండా ఆత్మపరిశీలన చేసుకోవాలి. నేనెప్పుడూ బలంగా ఉంటానని అందరూ అనుకుంటారు. కానీ కొన్నిసార్లు నేనూ కుంగిపోతున్నాను. కొన్ని విషయాలను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం. నేను అందుబాటులో ఉన్నా లేకున్నా, మీ ప్రేమ మద్దతు కొనసాగుతుందని ఆశిస్తున్నాను'' ఇన్‌స్టాలో రష్మి సరదాగా నవ్వుతూ నవ్విస్తూ ఫొటోలను పంచుకునే రష్మి.. సడెన్‌గా ఇలాంటి పోస్ట్ చేయడంతో కొందరు ఫ్యాన్స్ ఏమైందంటూ ఆరా తీస్తున్నారు. బలంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ ఆమె పోస్ట్ కింద కామెంట్లు పెడుతున్నారు.

**ఏంటీ డిజిటల్ డీటాక్స్..**

వృత్తిపరంగా లేదా సరదాగా సమయం గడవటం లేదంటూ చాలా మంది డిజిటల్ ప్రపంచమే లోకంగా బతుకుతున్నారు. వీడియోలు, సినిమాలు చూస్తూ చాటింగ్‌లతో ఫోన్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే చాలా మంది డిజిటల్ పరికరాలకు బందీలవుతున్నారు. దానితో తలెత్తే ఇబ్బందులు గుర్తించిన చాలా మంది ఇప్పుడిప్పుడే కళ్లు తెరుస్తున్నారు. వారంలో ఒకటి, రెండు రోజులు ఫోన్‌కు దాదాపు దూరంగా ఉండే 'డిజిటల్ డీటాక్స్' ఆచరణ క్రమంగా పెరుగుతోంది. ఇందులో భాగంగా వచ్చినవే '888 రూల్' (8 గంటలు మీ వృత్తికి, 8 గంటలు గ్యాడ్జెట్‌స్‌ని పక్కన పెట్టేసి హాయిగా నిద్ర పోవడానికి, మరో ఎనిమిది గంటలు ఇంటి పనులు పూర్తి చేసుకోవడానికి సమయం కేటాయించుకోవడం), గ్యాడ్జెట్‌స్‌కీ వీక్లీఆఫ్‌లాంటివి పాటిస్తున్నారు.



# కోపాన్ని తగ్గించుకోవడానికి రజనీకాంత్ నాకు ఇచ్చిన సలహా ఇదే: మోహన్‌బాబు

**రజనీకాంత్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని నటుడు మోహన్‌బాబు చెప్పారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రజనీకాంత్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా తమ మధ్య అనుబంధం ఉందని తెలిపారు.**

''రజనీకాంత్ గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి. మా ఇద్దరి మధ్య 50 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. నేను అతడిని 'ఏయ్ బ్లడీ తలైవా' అని ముద్దుగా పిలుస్తాను. మా మధ్య అంత చనువు ఉంది. 50 ఏళ్ల క్రితం మా వద్ద ఏమీ లేనప్పుడు నటులుగా పరిచయం కాకముందు మద్రాసు ప్లాట్‌ఫామ్‌పై మొదటిసారి కలుసుకున్నాం. అప్పటినుంచి మా బంధం కొనసాగుతోంది. రోజులో కనీసం 3, 4 సార్లైనా మెసేజ్ చేసుకుంటాం. ఇటీవల కలిసినప్పుడు అతడు ఒకమాట చెప్పాడు. 'నాకు గతంలో ఎంత కోపం ఉండేదో నీకు తెలుసు. నేను తర్వాత కాలంలో దాన్ని వదిలేశాను. నువ్వెందుకు వదల్లేకపోతున్నావు. పుస్తకాలు చదవడం కాదు.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని కోపాన్ని వదిలెయ్' అని సలహా ఇచ్చాడు'' అని మోహన్‌బాబు గుర్తుచేసుకున్నారు.

రజనీకాంత్, మోహన్‌బాబు మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. రజనీ హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ మోహన్‌బాబుని కలుస్తుంటారు. ఈవిషయాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా ఇద్దరూ వెల్లడిస్తూనే ఉంటారు. ఇక మోహన్‌బాబు చివరిగా 'కన్నప్ప' చిత్రంలో కనిపించారు. అందులో వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహాదేవశాస్త్రి పాత్రలో నటించి మెప్పించారు. ఈ సినిమాను రజనీకాంత్‌కు ప్రత్యేకంగా చూపించగా.. ఆయన ఆ సినిమా టీమ్‌ను అభినందించారు. ఆ ఫొటోలు కూడా ఇటీవల వైరలైన విషయం తెలిసిందే.





## విధ్వంసం సృష్టించిన టీమిండియా కెప్టెన్.. వన్డేల్లో రెండో వేగవంతమైన శతకం

**మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుతో ఇవాళ (జులై 22) జరుగుతున్న నిర్ణయాత్మక చివరి వన్డేలో భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెలరేగిపోయింది.**

ఈ మ్యాచ్‌లో హర్మన్ కేవలం 82 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, భారత్ తరఫున వన్డేల్లో రెండో వేగవంతమైన సెంచరీని నమోదు చేసింది. ఫలితంగా టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 318 పరుగుల భారీ స్కోర్ చేసింది.

ఈ మ్యాచ్‌లో మొత్తంగా 84 బంతులు ఎదుర్కొన్న హర్మన్ 14 ఫోర్ల సాయంతో 102 పరుగులు చేసి ఔటైంది. హర్మన్‌తో పాటు భారత ఇన్నింగ్స్‌లో జెమీమా రోడ్రిగెజ్ (50), స్మృతి మంధన (45), హర్లీన్ డియోల్ (45), రిచా ఘోష్ (38 నాటౌట్), ప్రతిక రావల్ (26) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

భారత బ్యాటర్ల ధాటికి ఈ మ్యాచ్‌లో ఇంగ్లీష్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. సోఫీ ఎక్లెస్టోన్ (102281) మినహా మిగతా బౌలర్లంతా ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. లారెన్ బెల్ 10 ఓవర్లలో 82, లారెన్ ఫైలర్ 10 ఓవర్లలో 64, చార్లోట్ డీన్ 10 ఓవర్లలో 69, లిన్సే స్మిత్ 10 ఓవర్లలో 74 పరుగులు సమర్పించుకొని తలో వికెట్ తీశారు.

**భారత్ తరఫున అత్యంత వేగవంతమైన వన్డే సెంచరీలు..**
**70 స్మృతి మంధన vs ఐర్లాండ్ రాజ్‌కోట్ 2025**
**82 హర్మన్‌ప్రీత్ కౌర్ vs ఇంగ్లాండ్ చెస్టర్-లీ-స్ట్రీట్ 2025**
**85 హర్మన్‌ప్రీత్ కౌర్ vs దక్షిణాఫ్రికా బెంగళూరు 2024**
**89 జెమిమా రోడ్రిగ్స్ vs దక్షిణాఫ్రికా కొలంబో RPS 2025**

ఇదిలా ఉంటే, మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లు తలో మ్యాచ్ గెలిచి 11తో సమంగా ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకే సిరీస్ సొంతమవుతుంది. దీనికి ముందు ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగగా, భారత్ 32 తేడాతో ఆ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తుంది.



## సెంచరీ మిస్ చేసుకున్న ఆయుశ్ మాత్రే

**ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరుగుతున్న రెండో యూత్ టెస్ట్‌లో భారత అండర్-19 జట్టు కెప్టెన్ ఆయుశ్ మాత్రే తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో మాత్రే 90 బంతుల్లో 14 ఫోర్లు, సిక్సర్ సాయంతో 80 పరుగులు చేసి ఔటయ్యాడు.**

మాత్రే సెంచరీ మిస్ అయినా మరో భారత యువ ఆటగాడు విహాన్ మల్హోత్రా శతక్కొట్టాడు. విహాన్ 123 బంతుల్లో 19 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 120 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మూడో రోజు రెండో సెషన్ సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు కోల్పోయి 260 పరుగులు చేసింది. భారత్ ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ఇంకా 49 పరుగులు వెనుకపడి ఉంది. కనిష్క్ చౌహాన్ (7), నమన్ పుష్పక్ (0) క్రీజ్‌లో ఉన్నారు.

ఆయుశ్ మాత్రే వికెట్ కోల్పోయాక టీమిండియా 85 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది. మాత్రే, విహాన్ క్రీజ్‌లో ఉండగా టీమిండియా భారీ స్కోర్ చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే రాల్ఫీ ఆల్బర్ట్ (152536) టీమిండియా బ్యాటర్లను కుదురుకోనివ్వకుండా వరుస విరామాల్లో వికెట్లు తీశాడు.

మాత్రే, విహాన్ ఔటయ్యాక నలుగురు బ్యాటర్లు (అభిగ్యాన్ కుందు, రాహుల్ కుమార్, అంబరీష్, హెనిల్ పటేల్) డకౌట్ అయ్యారు. మధ్యలో హర్‌వంశ్ పంగాలియా (28) భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో భారత చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ (20) తక్కువ స్కోర్‌కే ఔటయ్యాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ థామస్ ర్యూ అర్ధ శతకం (59)తో మెరవగా.. భారత సంతతికి చెందిన ఏకాన్ష్ సింగ్ (117) శతకంతో ఆకట్టుకున్నాడు. మిగతా వారిలో జేమ్స్ మింటో (46) ఒక్కడే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. భారత బౌలర్లలో నమన్ పుష్పక్ 4, ఆదిత్య రావత్, అంబరీష్ తలో 2, హెనిల్ పటేల్, విహాన్ మల్హోత్రా చెరో వికెట్ పడగొట్టారు.

కాగా, భారత్ఇంగ్లండ్ మధ్య రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది. ఆ మ్యాచ్‌లో భారత కెప్టెన్ ఆయుశ్ మాత్రే తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో కదంతొక్కాడు. రెండో ఇన్నింగ్స్‌లో వైభవ్ మెరుపు అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

దీనికి ముందు జరిగిన 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 32 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఓ సెంచరీ సహా పలు విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడాడు.

## భారత్‌కు శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ మద్దతు..

# ఇరకాటంలో పీసీబీ

**ఈ ఏడాది భారత్ వేదికగా జరగాల్సిన ఆసియా కప్ నిర్వహణ కోసం ఢాకాలో జులై 24 - 25న ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే, ఈ సమావేశానికి మేం వచ్చేది లేదని.. మీటింగ్ వేదిక మార్చాలని ఇప్పటికే బీసీసీఐ డిమాండ్ చేసింది. అయితే ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నక్వీ ఈ మార్పుపై సానుకూలంగా లేరు. తాజాగా శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డులు కూడా భారత్‌కు మద్దతుగా నిలిచినట్లు సమాచారం. దీంతో పీసీబీ ఇరకాటంలో పడింది. ఈ సమావేశం జరగాలంటే ఏసీసీలోని ముగ్గురు శాశ్వత (టెస్టులు ఆడే దేశాలు) సభ్యులు హాజరు కావాలనే విషయం తెలిసిందే.**

ఏసీసీ రాజ్యాంగం ప్రకారం కనీసం 10 పూర్తిస్థాయి లేదా అసోసియేట్ దేశాల సభ్యులు సమావేశానికి హాజరు కావాలి. నేపాల్, యూఏఈ, సింగపూర్, మలేసియా, థాయిలాండ్, హాంకాంగ్ కువైట్, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్ పూర్తి సభ్యదేశాలు కాగా.. బహ్రెయిన్, భూటాన్, కంబోడియా, తజికిస్థాన్, మాల్దీవులు, జపాన్, ఇరాన్, చైనా, మయన్మార్, ఇండోనేసియా అసోసియేట్ దేశాలు. అయితే, ఒమన్, నేపాల్, మలేసియా, సింగపూర్, థాయిలాండ్, కువైట్, యుఏఈ, బహ్రెయిన్, భూటాన్, మాల్దీవులు, మయన్మార్, ఇండోనేసియా సమావేశానికి హాజరుకావడం అనుమానంగానే కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మీటింగ్ నిర్వహించాలా లేదా మరో చోటికి మార్చాలా అనే దానిపై పీసీబీ మల్లగుల్లాలు పడుతోంది.

"ఆసియా కప్ ఇప్పుడు భౌగోళిక రాజకీయ అంశంగా మారినట్లు కనిపిస్తోంది. ఢాకాలో ఏసీసీ సమావేశాన్ని నిర్వహించడానికి బీసీబీ తాత్కాలిక అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం బుల్బుల్‌ని పీసీబీ అధ్యక్షుడు సంప్రదించినప్పుడు ఆలోచించాల్సింది. ఈ వ్యవహారమంతా అర్థం కావడానికి అమీనుల్‌కి మరింత సమయం పడుతుందని భావిస్తున్నాం. అనుభవరాహిత్యం కారణంగా భౌగోళిక, రాజకీయ చిక్కులను అర్థం చేసుకోకుండా ఏసీసీ మీటింగ్‌ను నిర్వహించడానికి అమీనుల్ అంగీకరించాడు. ఇది బీసీసీఐకి ఇబ్బంది కలిగించే అంశం కావడంతో..కొంతమంది బోర్డు డైరెక్టర్లు సమావేశాన్ని రద్దు చేయాలని కోరారు. కానీ, తాను పీసీబీకి మాట ఇచ్చానని, ఇప్పుడు వెనక్కి తీసుకోలేనని మొండిపట్టుపట్టారు" అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వర్గాలు చెబుతున్నాయి.





## రవిశాస్త్రి ఆల్‌టైమ్ గ్రేట్ టాప్-5 భారత క్రికెటర్లు వీరే.. రోహిత్, ద్రవిడ్‌కు దక్కని చోటు

**టీమ్ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి తన ఆల్ టైమ్ టాప్-5 గొప్ప భారత క్రికెటర్ల పేర్లను వెల్లడించాడు. రాహుల్ ద్రవిడ్, సౌరభ్ గంగూలీ, అనిల్ కుంబ్లే, రోహిత్ శర్మ లలో ఒక్కరిని కూడా రవిశాస్త్రి తన ఆల్‌టైమ్ టాప్-5లోకి తీసుకోలేదు. ఇటీవల రవిశాస్త్రి ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్‌లు మైకేల్ వాన్, అలిస్టర్ కుక్‌లతో కలిసి ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ఆల్‌టైమ్ టాప్-5 భారత క్రికెటర్లు ఎంచుకోవాలని కోరగా.. సునీల్ గావస్కర్, కపిల్ దేవ్, సచిన్ తెందూల్కర్, విరాట్ కోహ్లీ తోపాటు మహేంద్ర సింగ్ ధోనీ పేర్లను చెప్పాడు.**

ఈ ఐదుగురిలో 'నంబర్ వన్ ఎవరు?అని అలిస్టర్ కుక్ అడగ్గా.. 'బ్యాటింగ్‌పరంగా సునీల్ గావస్కర్ అని చెబుతా. కపిల్ దేవ్ అద్భుతమైన క్రికెటర్. ఇక అన్ని కోణాల్లో చూస్తే సచిన్ నంబర్ వన్. 24 ఏళ్లపాటు కెరీర్ కొనసాగించాడు. 100 సెంచరీలు చేశాడు. తన తరంలో ప్రతి ఒక్క పేస్ బౌలింగ్ అటాక్‌ను ఎదుర్కొన్నాడు. వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్, ఇమ్రాన్ ఖాన్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ కెరీర్ ఆరంభించాడు. తర్వాత స్టువర్ట్ బ్రాడ్, జేమ్స్ అండర్సన్, జాక్వెస్ కలిస్, షాన్ పొలాక్ వంటి పేసర్లను కాచుకుని పరుగులు చేశాడు' అని రవిశాస్త్రి సమాధానమిచ్చాడు. ఇదే పాడ్‌కాస్ట్‌లో భారత స్టార్ క్రికెటర్లు ఆదాయం గురించి ఇంగ్లాండ్ మాజీలు రవిశాస్త్రిని ప్రశ్నించగా.. కచ్చితంగా ఎంత మొత్తం సంపాదిస్తున్నారో తెలియదని, కానీ అది దాదాపు రూ.100 కోట్లు ఉంటుందని రవిశాస్త్రి అన్నాడు. ధోనీ, విరాట్ కోహ్లీ వంటి పెద్ద స్టార్లు 1520 ప్రకటనలు చేస్తారని, తద్వారా భారీగా డబ్బు సంపాదిస్తారని పేర్కొన్నాడు.

## భారత తుదిజట్టులో మూడు మార్పులు ఇవే!



టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్

**ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు నేపథ్యంలో భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ టీమిండియా యాజమాన్యానికి కీలక సూచనలు చేశాడు. లార్డ్స్‌లో మూడో టెస్టు ఆడిన తుదిజట్టులో మూడు మార్పులు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డాడు. వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ వరుసగా విఫలమవుతున్నాడన్న ఇర్ఫాన్ పఠాన్.. అతడిని పక్కకపెట్టక తప్పదన్నాడు.**

కరుణ్ స్థానంలో యువ ఆటగాడు సాయి సుదర్శన్‌కు చోటివ్వాలని ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇంగ్లండ్ బౌలర్లు లెఫ్టాండర్ బ్యాటర్లను ఎదుర్కోవడంలో అంతగా సఫలం కాలేకపోతున్నారని.. అందుకే సాయికి మరో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నాడు. అదే విధంగా.. అనివార్యమైన మరో రెండు మార్పుల గురించి కూడా ఇర్ఫాన్ పఠాన్ ప్రస్తావించాడు.

**కరుణ్ నాయర్ బెంచ్ మీదే**

ఈ మేరకు.. "కరుణ్ నాయర్ కొన్ని మంచి ఇన్నింగ్స్ ఆడాడు. కానీ ఎక్కువగా పరుగులు రాబట్టలేకపోయాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికి అతడి అత్యధిక స్కోరు 40 మాత్రమే. అయితే, మంచి బంతులకే అతడు అవుటయ్యాడు.

ఒకవేళ అతడు పరుగులు రాబట్టడంలో సతమతమవుతున్నాడని భావిస్తే.. తప్పకుండా అతడిని బెంచ్‌కే పరిమితం చేయాలి. కరుణ్ నాయర్ స్థానంలో సాయి సుదర్శన్‌ను ఆడించాలి. ఎందుకంటే అతడు ఎడమ చేతి వాటం బ్యాటర్. ఇప్పటి వరకు జరిగిన మూడు టెస్టులను పరిశీలిస్తే ఇంగ్లండ్ బౌలర్లు లెఫ్టాండర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడుతున్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.

**వికెట్ కీపర్‌గా జురెల్**

ఇక రిషభ్ పంత్ కూడా గాయపడ్డాడనే సమాచారం ఉంది. కాబట్టి అతడు ఈసారి కేవలం బ్యాటర్‌గా మాత్రమే అందుబాటులో ఉంటాడు. అతడి స్థానంలో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్ వస్తే.. బ్యాటింగ్ విభాగంగా మరింత పటిష్టం అవుతుంది.

భారత్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అతడు 90 పరుగులతో ఆకట్టుకున్న విషయాన్ని మర్చిపోవద్దు. బ్యాటర్‌గా ఫర్వాలేదనిపిస్తున్నా.. వికెట్ కీపర్‌గా అతడు మరింత మెరుగుపడాలి.

**అన్షుల్ వద్దు.. అతడే బెటర్**

ఇక పేసర్ ఆకాశ్ దీప్ ఆరంభంలో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ అతడి ఫిట్‌నెస్ సమస్యల దృష్ట్యా ఇప్పుడు ప్రసిద్ కృష్ణ జట్టులోకి వస్తాడు. అన్షుల్ కాంబోజ్ కూడా ఒకే. కానీ కీలక మ్యాచ్‌లో ప్రసిద్ కృష్ణనే ఆడిస్తే బెటర్. అతడి అనుభవం అక్కరకు వస్తుంది.

ఇక అర్ష్‌దీప్ సింగ్ గాయపడి టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే. కాబట్టి ఎలా చూసినా ప్రసిద్‌కు లైన్ క్లియర్ అయినట్లే. అన్షుల్ కాంబోజ్ తుదిజట్టులో ఉంటే బాగుంటుంది. అతడి బౌలింగ్ శైలి నాకెంతో ఇష్టం.

కానీ ప్రస్తుతం అరంగేట్ర బౌలర్ కన్నా.. అనుభవజ్ఞుడైన బౌలర్ అవసరం ఉంది కాబట్టి.. నేను ప్రసిద్ వైపు మొగ్గుచూపుతాను" అని ఇర్ఫాన్ పఠాన్ చెప్పుకొచ్చాడు. కరుణ్ నాయర్ స్థానంలో సాయి సుదర్శన్, ఆకాశ్ దీప్ ప్లేస్‌లో ప్రసిద్ కృష్ణను ఆడించాలన్న పఠాన్.. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానాన్ని బ్యాటర్ ధ్రువ్ జురెల్‌తో భర్తీ చేయాలని సూచించాడు.

కాగా టీమిండియాతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఇంగ్లండ్ 21తో ఆధిక్యంలో ఉంది. ఇరుజట్ల మధ్య జరిగే నాలుగో టెస్టు (జూలై 2327)కు మాంచెస్టర్ వేదిక.

**ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు ఇర్ఫాన్ పఠాన్ ఎంచుకున్న భారత తుదిజట్టు**
**యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ.**

## హెచ్‌సీఏ అక్రమాల కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాల కేసులో ఐదుగురు నిందితులకు మల్కాజ్‌గిరి కోర్టు మరో 14 రోజుల పాటు రిమాండ్‌ను పొడిగించింది. నిందితుల్లో నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించగా.. కవితను చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. ఐదుగురు నిందితులు మల్కాజ్‌గిరి కోర్టులో మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోగా.. ఈ పిటిషన్‌పై వాదనలు రేపు వింటామని కోర్టు తెలిపింది.**

కాగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ (ఐపీఎల్) యాజమాన్యాన్ని బెదిరించి.. అదనపు ప్రయోజనాలు పొందాలని చూసిన కేసులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు జైలుపాలైన విషయం తెలిసిందే. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీఐడీ.. అధ్యక్షుడితో పాటు కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈఓ సునీల్ కంటే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవితలను అరెస్టు చేసింది.